# ఎన్టీఆర్

## రాజకీయ జీవితచిత్రం - అసలు కథ

---

కొండుభట్ల రామచంద్రమూర్తి

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | చారిత్రక ప్రయాణం | 9 |
| 2. | పల్లెటూరు బైతు హీరో అయ్యాడు | 14 |
| 3. | తెలుగు తెర మహాతార | 32 |
| 4. | ఒక ప్రబలమైన జాతి | 59 |
| 5. | ఒక పెద్ద ముందడుగు | 69 |
| 6. | జనం హృదయాల్లో వెండితెర దేవుడు | 84 |
| 7. | పరిపాలనలో హీరో తప్పటడుగులు | 115 |
| 8. | ఎన్‌టీఆర్ పునరుత్థానం | 150 |
| 9. | మళ్ళీ ఎన్నికలు | 186 |
| 10. | ఎన్‌టీఆర్ తొలి ఓటమి | 225 |
| 11. | ఎన్‌టీఆర్ జీవితంలో శృంగారం | 255 |
| 12. | చరిత్రను తిరగరాసిన కథానాయకుడు | 282 |
| 13. | అర్థాంగి పట్ల అధినేత విశ్వాసం | 324 |
| 14. | వైస్రాయ్ హోటల్‌లో హైడ్రామా | 357 |
| 15. | నెత్తురు చిందని తిరుగుబాటు | 405 |
| 16. | నాటకం ముగిసింది, హీరో నిష్క్రమించాడు | 430 |
| 17. | స్వానురాగం | 443 |

## అధ్యాయం - 1

# చారిత్రక ప్రయాణం

హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియం చాలా చారిత్రక సన్నివేశాలకు సాక్షీభూతంగా నిలిచింది. లోగడ అక్కడ సైన్యం విడిది చేసేది. క్రికెట్ ఆడేవారు. అక్కడే 1950లో క్రికెట్ స్టేడియం నిర్మించారు. అక్కడ హైదరాబాద్ నగర నిర్మాత కులీకుతుబ్ షా ఒక అందమైన తోట (బాగ్-ఇ-దిల్ ఖుషా) నిర్మించాడు. ఔరంగజేబు చక్రవర్తి గోలకొండపైన దండెత్తినప్పుడు మొఘల్ సైన్యం మకాం ఉండేందుకు ఆ తోటలో చెట్లను తొలగించి చదును చేశారు. మొఘలులు 1687లో గోల్కొండను స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ తోటను ఫతేమైదాన్ (విజయభూమి) అని పిలవడం ప్రారంభించారు.

అటు తర్వాత పాతనగరంలోని పురానాపూల్ కిందుగా చాలా నీరు ప్రవహించింది. హైదరాబాదీలకు ఫతేమైదాన్ ఒక ఆకుపచ్చని మైదానంగా మిగిలింది. హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత యూనియన్లో విలీనం చేసేందుకు 1948లో జనరల్ జె.ఎన్. చౌధురి సైనిక ప్రభుత్వాధినేతగా తొలి బహిరంగసభను ఉద్దేశించి అక్కడ ప్రసంగించారు. ఆ మైదానంలోనే హైదరాబాద్‌లో తొలి క్రికెట్ టెస్ట్ మ్యాచ్ 1955లో జరిగింది.

భారత, పాకిస్తాన్‌ల మధ్య 1965లో యుద్ధం జరిగినప్పుడు నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ రక్షణ నిధికి విరాళాలు సేకరించే ఉద్దేశంతో దేశవ్యాప్త పర్యటనలో భాగంగా హైదరాబాద్ సందర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 1.25 లక్షల గ్రాముల బంగారం రక్షణ నిధికి విరాళంగా ఇచ్చింది.

నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్ గా ప్రసిద్ధులు) అప్పటికే సుప్రసిద్ధ సినీనటుడు. “ఎన్‌టీఆర్ జాతీయ రక్షణ నిధి” పేరిట విరాళాలు సేకరించడానికి ఆయన రాష్ట్రంలో పర్యటించి ఎనిమిది లక్షల రూపాయలు పోగు చేశారు. దానికి తన సొంత విరాళం లక్ష రూపాయలు కలిపి నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి అందజేశారు.

యుద్ధం ముగిసిన తర్వాత శాంతి చర్చల కోసం నాటి రష్యా ప్రధాని కోసిగిన్ చొరవతో తాష్కెంట్‌లో పాకిస్తాన్ సైనిక అధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అయూబ్ ఖాన్‌తో చర్చల కోసం వెళ్ళిన లాల్ బహదూర్ శాస్త్రి అక్కడే 11 జనవరి 1966న గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించి శవమై తిరిగి వచ్చారు. ఆ మహానేత స్మృతి చిహ్నంగా ఆ మైదానానికి లాల్ బహదూర్ శాస్త్రి పేరు పెట్టారు.

రెండు ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలూ, రాష్ట్రపతి పాలన అనంతరం 1973లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జలగం వెంగళరావు తెలుగువారి మధ్య సమైక్యతా భావం రగిలించే ఉద్దేశంతో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాలని నిర్ణయించారు. తెలుగుజాతి సాహిత్య వికాసాన్ని చాటి చెప్పాలన్నది సభల లక్ష్యం. ప్రపంచ తెలుగు మహాసభలను లాల్ బహదూర్ స్టేడియంలో 1975లో నిర్వహించారు.

ఈ స్టేడియం అంటే ఎన్‌టీఆర్ కి ప్రత్యేకమైన అభిమానం. అక్కడే తాను సేకరించిన జాతీయ రక్షణ నిధి విరాళాల మొత్తాన్ని ప్రధానికి అందజేసింది. అదే ప్రదేశంలో ప్రపంచ తెలుగు మహాసభలు జయప్రదంగా జరిగాయి. అందుకని అదే స్టేడియంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించాలని ఎన్‌టీఆర్ నిర్ణయించారు. మొత్తం నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్‌టీఆర్ ప్రమాణస్వీకారం చేస్తే అందులో మూడు విడతలు లాల్ బహదూర్ స్టేడియంలోనే చేశారు.

★ ★ ★

అది 7 జనవరి 1983. ఆంధ్రప్రదేశ్ తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ఎన్‌టీఆర్ ప్రమాణస్వీకారానికి రంగం సిద్ధమైంది. హైదరాబాద్‌లో పబ్లిక్ గార్డెన్స్‌లో జూబిలీ హాల్లో తెలుగుదేశం లెజిస్లేచర్ పార్టీ సమావేశమై తమ నేతగా ఎన్‌టీఆర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.